క్లుప్తంగా

తడి-పొడి చెత్త వేరు చేయడంపై అవగాహన



విశాలాక్షినగర్‌లో ప్లాస్టిక్‌పై అవగాహన కల్పిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్

ఆరిలోవ: విశాలాక్షినగర్‌లోని జీవీఎంసీ తొమ్మిదో వార్డు పరిధిలో స్థానికులకు ప్లాస్టిక్ వాడకం, తడి, పొడి చెత్త వేరుచేయడంపై పారిశుద్ధ్య సిబ్బంది శుక్రవారం అవగాహన కల్పించారు. 'స్వచ్ఛాంధ్ర', 'స్వర్ణాంధ్ర'లో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్నాజీ సూచనలు చేశారు. ఇళ్లలో తడి, పొడి చెత్తను ఎలా వేరుచేయాలి, ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై ఆయన వివరంగా వివరించారు. ప్రతిరోజూ ఇంటివద్దకు వచ్చే జీవీఎంసీ చెత్త సేకరణ వాహనాలకు తడి, పొడి చెత్తను అందించాలని సూచించారు. చెత్తను కాలువల్లో, రోడ్లపై ఎక్కడపడితే అక్కడ వేయకూడదని కోరారు. అలాగే, ప్లాస్టిక్ సంచుల వినియోగాన్ని పూర్తిగా మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో సచివాలయం, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన

ఆరిలోవ : జీవీఎంసీ 12వ వార్డు పరిధి దుర్గానగర్, న్యూ అంబేడ్కర్‌నగర్‌లలో సీసీ రోడ్లు, కాలువలు నిర్మాణం పనులు ప్రారంభమయ్యాయి. ఈ పనులకు శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కాలనీలలో ఉన్న తారు రోడ్లు శిథిలావస్థకు చేరాయని, వాటి స్థానంలో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణం రూ.30 లక్షల జీవీఎంసీ నిధులతో చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఎస్ఈ కృష్ణారావు, ఈఈ శాంతిరాజు, డీఈ వెంకటరావు, మాజీ కార్పొరేటర్ ఒమ్మి సన్యాసిరావు, స్థానిక నాయకులు ఏడువాక సన్యాసిరావు, అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

గొల్ల బాబూరావు దృష్టికి ఉపాధ్యాయుల సమస్యలు



ఎంపీ గొల్ల బాబూరావు సత్కరిస్తున్న టీచర్స్ యూనియన్ నాయకులు

మద్దిలపాలెం: రాజ్యసభ సభ్యుడు గొల్లా బాబూరావును ఆంధ్రప్రదేశ్ టీచర్స్ యూనియన్ నాయకులు బ్రహ్మారెడ్డి , రాష్ట్ర కార్యదర్శి కృపానందం శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా వారు ఉపాధ్యాయుల సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. వారి వినతికి స్పందించిన ఎంపీ బాబూరావు, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఉపాధ్యాయ సంఘం నాయకులు ఎంపీని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో వై. దేముడు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా డిగ్రీ కళాశాలను సందర్శించిన ఆర్జేడీ



ఆర్జేడీతో కళాశాల అధ్యాపక బృందం

మద్దిలపాలెం: జోన్ 1, 2 ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి డాక్టర్ పి.వి. కృష్ణాజీ శుక్రవారం డాక్టర్ వీఎస్. కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్, వివిధ విభాగాల అధిపతులు, వైస్ ప్రిన్సిపాల్ నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆర్జేడీని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆర్జేడీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విధులకు విధిగా హాజరై విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాలని కోరారు.

ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గం

భీమునిపట్నం: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) భీమిలి పట్టణశాఖ నూతన కార్యవర్గ ఎన్నిక శుక్రవారం జరిగింది. విశాఖ జిల్లా ఏపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి టి.రామకృష్ణ ఎన్నికల నిర్వహణ అధికారిగా వ్యవహరించారు. గౌరవ అధ్యక్షుడిగా డి. ఈశ్వరరావు,అధ్యక్షుడిగా సీహెచ్.మోహనకృష్ణ ఎన్నికయ్యారు.





రామ్‌నగర్ నుంచి సిరిపురం సర్కిల్ వైపు వెళ్లే మార్గంలో నో పార్కింగ్ బోర్డు వద్ద వాహనాలు



సిరిపురం సర్కిల్ నుంచి రామ్‌నగర్ వైపు వెళ్లే రోడ్డులో పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలు

- రోడ్ల మీదే వాహనాల పార్కింగ్
- నో పార్కింగ్ బోర్డుల ఎదుటే వాహనాల తిష్ట
- రద్దీగా మారుతున్న రామ్ నగర్
- టాఫిక్ నియంత్రణ గాలికి..

ట్రాఫిక్ పోలీసులు ఏం చేస్తున్నట్టు?



రోడ్డును ఆక్రమించి పార్క్ చేసిన వాహనాలు

బీచ్ రోడ్డు : నగరంలో నిత్యం రద్దీగా ఉండే రామ్ నగర్ – పెదవాల్తేరు ప్రధాన రహదారి ఇప్పుడు వాహనదారులకు నరకంగా మారింది. రోడ్డు పక్కన 'నో పార్కింగ్' బోర్డులు ఉన్నా, వాటిని ఏ మాత్రం లెక్కచేయకుండా యథేచ్ఛగా వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. దీనికి తోడు, ట్రాఫిక్ పోలీసులు కళ్ల ముందు జరుగుతున్నా తమకేమీ పట్టనట్లు వ్యవహరించడం గమనార్హం.

రామ్‌నగర్ నుంచి పెదవాల్తేరు వైపు వెళ్లే మార్గంలో అనేక ప్రముఖ స్వీట్ షాపులు, రెస్టారెంట్లు, షాపింగ్ మాల్స్ ఉన్నాయి. ఈ దుకాణాలకు వచ్చే వినియోగదారులు రోడ్డునే తమ సొంత పార్కింగ్ స్థలంగా భావిస్తున్నారు. ముఖ్యంగా కేర్ హాస్పిటల్ నుంచి ద్రోణంరాజు సర్కిల్ వరకు ఈ దుశ్చర్య అధికంగా కనబడుతోంది. సాయంత్రం వేళల్లో ఈ రోడ్డుపై ప్రయాణించడం అంటే యుద్ధం చేయడమే. ఇది రోడ్డు మార్గమా లేక పార్కింగ్ స్థలమా అనే అనుమానం కలగక మానదు. ద్రోణంరాజు సర్కిల్ నుంచి రామ్‌నగర్ వైపు వెళ్లే మార్గంలో పరిస్థితి మరింత దారుణం. అక్కడ కొన్ని సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఉండటంతో, బస్ స్టాప్‌లను కూడా పార్కింగ్ స్థలాలుగా మార్చేశారు.

'నో పార్కింగ్' బోర్డులు కేవలం అలంకారప్రాయమే..

ట్రాఫిక్ పోలీసులు ఎక్కడెక్కడో 'నో పార్కింగ్' బోర్డులను ఏర్పాటు చేశారు. కానీ వాహనదారులు అదే బోర్డుల వద్దే కార్లు, ద్విచక్ర వాహనాలు నిలిపి, ట్రాఫిక్ పోలీసులకు సవాల్ విసురుతున్నారు. ఇంత నిర్లక్ష్యం జరుగుతున్నా, ట్రాఫిక్ పోలీసులు మాత్రం కనీసం చూసిచూడనట్లు వ్యవహరించడం ప్రజాగ్రహానికి కారణమవుతోంది. వారికి అసలు బాధ్యత ఉందా లేదా అనే ప్రశ్న తలెత్తుతోంది.

ప్రముఖుల మార్గంలో ఈ దుస్థితి ఏమిటి?

నగరానికి వచ్చే ప్రముఖులు ప్రయాణించే ప్రధాన మార్గం ఇదే. ప్రభుత్వ అతిథి గృహాలకు, పోర్ట్ అతిథి గృహాలకు, నావికాదళ అధికారుల అతిథి గృహాలకు, బీచ్‌రోడ్‌లోని స్టార్ హోటల్స్‌కు ఈ మార్గం ద్వారానే రాకపోకలు కొనసాగిస్తుంటారు. అటువంటి కీలక మార్గంలో వాహనాలను ఇష్టమొచ్చినట్లు పార్కింగ్ చేస్తున్నా, ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోకపోవడం సిగ్గుచేటు.

చోద్యం చూస్తున్న ట్రాఫిక్ పోలీసులు.. జరిమానాలే లక్ష్యం

నగర పోలీస్ కమిషనర్‌గా బాగ్చి బాధ్యతలు స్వీకరించినప్పుడు రోడ్డుపై పార్కింగ్ చేసిన వాహనాలకు వీల్ లాకింగ్ చేసి హడావుడి చేసిన ట్రాఫిక్ పోలీసులు ఇప్పుడు ఎందుకు చోద్యం చూస్తున్నారు? భారీ సంఖ్యలో వాహనాలు నిలిపివేసినా, తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తూ, చూసి చూడనట్లు వదిలేస్తున్నారు. సిరిపురం సర్కిల్ వద్ద ఒక ఏఎస్ఐ తన బృందంతో కేవలం వాహనాలను ఆపి జరిమానాలు వేస్తూ చేతులు దులుపుకుంటున్నారు. పక్కనే రోడ్డు మీద భారీగా వాహనాలు నిలిపివేసి షాపుల్లోకి వెళ్తుంటే మాత్రం పట్టించుకోరు. దీంతో ఒక్కోసారి ట్రాఫిక్ జామ్‌తో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



చలానాలు రాస్తున్న ట్రాఫిక్ ఏఎస్ఐ (ఫైల్)

ట్రాఫిక్ నియంత్రణను గాలికొదిలేసి, జరిమానాల వేటే ధ్యేయంగా పెట్టుకున్న ట్రాఫిక్ పోలీసుల వైఖరిపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నడిరోడ్డుపై యువకుల హల్‌చల్..



సిరిపురం నడిరోడ్డుపై బర్త్‌డే పార్టీ (ఫైల్)

నగరంలో ట్రాఫిక్ పోలీసులు విధుల్లో ఉన్నప్పటికీ, యువకుల నిర్లక్ష్యపూరిత ప్రవర్తన వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. దీనికి నిదర్శనంగా సిరిపురం సర్కిల్‌లో జరిగిన ఒక ఘటన ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సుమారు 30 మంది యువకులు తమ స్నేహితురాలి పుట్టినరోజు వేడుకలను నడిరోడ్డుపైనే ఘనంగా జరుపుకున్నారు. కేక్ కట్ చేసి, ఒకరిపై ఒకరు కేక్ విసురుకుంటూ హల్‌చల్ చేశారు. ఈ సంఘటన ఏఎస్సై బృందం విధులు నిర్వహిస్తున్న అతి సమీపంలోనే జరగడం గమనార్హం. యువకుల ఈ చర్యతో ఆ మార్గంలో వెళ్తున్న వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నడిరోడ్డుపై యువకులు చేసిన ఈ హల్‌చల్ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుండటంతో, 'నగరంలో అసలు పోలీసులు ఉన్నారా?' అనే సందేహం ప్రజల్లో వ్యక్తమవుతోంది. పోలీసుల పర్యవేక్షణ లోపం, నిర్లక్ష్యంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

'స్మార్ట్ మీటర్లు మాకొద్దు'



స్మార్ట్ మీటర్లు వద్దంటూ ఎస్ఐజీ నగర్‌లో ప్రచారం చేస్తున్న సీపీఎం నాయకులు

ఆరిలోవ : విద్యుత్ స్మార్ట్ మీటర్లు మాకొద్దంటూ సీపీఎం నాయకులు శుక్రవారం జీవీఎంసీ పదో వార్డులో ప్రచారం చేపట్టారు. ఇందులో భాగంగా రవీంద్రనగర్, ఎస్ఐజీ నగర్, వివేకానందనగర్ తదితర కాలనీలలో ఎర్ర జెండాలతో ర్యాలీగా వెళ్లి ప్రచారం చేశారు. పాత మీటర్లు ఉండగా స్మార్ట్ మీటర్లు ఎందుకంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ ఇళ్లకు పాత మీటర్లు పనిచేస్తుండగా ఆదానీ లాభాలు కోసం స్మార్ట్‌మీటర్లు బిగిస్తున్నారని తెలిపారు. దీని కోసం రూ.8 వేలు ఈఎంఐ ద్వారా ప్రతి నెలా వసూలు చేస్తున్నారన్నారు. ఇది అన్యాయమని ప్రజలంతా దీన్ని వ్యతిరేకించాలని కోరారు. ఇప్పటికే కరెంట్ బిల్లుల్లో అదనపు భారం వేస్తున్నారన్నారు. దానికి తోడు స్మార్ట్ మీటర్ల ఈఎంఐ మరింత భారమవుతుందన్నారు. కార్యక్రమంలో నరేంద్రకుమార్, వెంకటరావు, భూలోకరావు, నాగరాజు, తులసి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సుందరకాండ హరికథ



హరికథ ఉత్సవాలను ప్రారంభిస్తున్న వీఎండీఏ చైర్మన్ ఎంఎస్ఎన్‌రాజు, కార్యదర్శి రాంబాబు



హరికథ వినిపిస్తున్న భాగవతారిణి కాళ్ల నిర్మల

మద్దిలపాలెం: మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు జరిగే హరికథా ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ (వీఎండీఏ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలను వీఎండీఏ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ఎస్.ఎన్. రాజు, డాక్టర్ గుమ్ములూరి రాంబాబు ప్రారంభించారు.

తొలిరోజు విజయనగరానికి చెందిన భాగవతారిణి కళ్ల నిర్మల సుందరకాండపై హరికథను శ్రావ్యానందకరంగా సాగించారు. 'సుందరే సుందరో రామః, సుందరే సుందరః కపిహి, సుందరే సుందరి సీత సుందరి సుందరః' అనే కీర్తనతో తన గానాన్ని ప్రారంభించిన నిర్మల, రాముడు సుందరుడు, సీత సుందరి, లంక సుందరం, రామాయణం సుందర కావ్యం అంటూ సుందరకాండ మహత్యాన్ని వివరించారు. లంకేశ్వరుడు సీతమ్మవారిని అపహరించి అశోకవనంలో ఉంచినప్పుడు సీతారాములు పడిన దుఃఖం, సుగ్రీవుడు తన సైన్యాన్ని నాలుగు దిక్కులా పంపించి సీతమ్మను అన్వేషించే ఘట్టాలను భాగవతారిణి నిర్మల తన చక్కని గానంతో వివరించారు. మధ్యమధ్యలో త్యాగరాజ కృతులను జోడించి, సుమధురంగా ఆలపించి ప్రేక్షకులను కథలో లీనమయ్యేలా రక్తి కట్టించారు. ఆంజనేయస్వామి, జాంబవంతుడు, అంగదుడు తదితరులు ఉత్తర దిక్కున సీతమ్మను వెతికి పట్టుకున్న వృత్తాంతాన్ని అద్భుతంగా గానం చేశారు.

నేడు దాన వీర శూరకర్ణ హరికథ

హరికథా ఉత్సవాలలో భాగంగా శనివారం జేజీ నారాయణ భాగవతార్ 'దాన వీర శూరకర్ణ' కథను అద్భుతంగా వినిపించనున్నారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని వీఎండీఏ కార్యదర్శి డాక్టర్ గుమ్ములూరి రాంబాబు తెలిపారు. సాయంత్రం 6:30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు.

ఏయూ బీవోఎస్ చైర్మన్‌గా చిట్టిబాబు



వీసీ నుంచి ఉత్తర్వులు అందుకుంటున్న చిట్టిబాబు

మద్దిలపాలెం: ఆంధ్ర యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల, కెమికల్ ఇంజనీరింగ్ విభాగం ఆచార్యులు ఎస్. చిట్టిబాబు బోర్డు ఆఫ్ స్టడీస్ (బీవోఎస్) చైర్మన్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు నియామక ఉత్తర్వులను ఏయూ వీసీ ఆచార్య రాజశేఖర్ శుక్రవారం ఆయనకు అందజేశారు. ఇప్పటివరకు బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా ఉన్న ఆచార్య కేవీ రమేష్ నుంచి చిట్టిబాబు బాధ్యతలను స్వీకరించారు.

ప్లాస్టిక్ వినియోగించిన వ్యాపారులకు జరిమానా



దుకాణదారుడిపై కేసులు నమోదు చేస్తున్న జీవీఎంసీ సిబ్బంది

మద్దిలపాలెం: జీవీఎంసీ 15వ వార్డులో ప్లాస్టిక్ కవర్లను యథేచ్ఛగా వాడుతున్న దుకాణదారులపై జీవీఎంసీ సిబ్బంది ఎట్టకేలకు చర్యలకు సిద్ధమయ్యారు. ప్లాస్టిక్ కవర్ల విచ్చలవిడి వాడకంపై జీవీఎంసీ ఉన్నతాధికారులకు అందిన ఫిర్యాదులకు స్పందిస్తూ, 15వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ శుక్రవారం పలు దుకాణదారులను గుర్తించి కేసులను నమోదు చేశారు. ముఖ్యంగా కొత్త వెంకోజీపాలెం జాతీయ రహదారి పక్కన ఉన్న వ్యాపారులు తక్కువ మైక్రాన్ కలిగిన కవర్లను వినియోగించడమే కాకుండా, దుకాణాల వద్ద డస్ట్‌బిన్‌లను ఏర్పాటు చేయకుండా వ్యాపారాలు కొనసాగించడాన్ని గుర్తించి రూ. 2 వేలు జరిమానాలు విధించారు. ఏఎంఓహెచ్ ప్రసాదరావు ఆదేశాల మేరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఈ కేసులను నమోదు చేశారు. ప్లాస్టిక్ వినియోగిస్తున్న వ్యాపారులకు రూ. 2000 వరకు జరిమానా విధించినట్లు శానిటరీ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ప్లాస్టిక్ కవర్లను వినియోగించినా, పరిశుభ్రతను పాటించకపోయినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

డ్రోన్ టెక్నాలజీపై శిక్షణ



కైలాసగిరి పోలీస్ మైదానంలో శిక్షణ పొందుతున్న పోలీసులు

ఆరిలోవ: నేరాల నియంత్రణలో డ్రోన్ టెక్నాలజీ వినియోగాన్ని పెంపొందించే లక్ష్యంతో అనకాపల్లి జిల్లా పోలీసులు కీలక అడుగు వేశారు. కైలాసగిరి ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీస్ మైదానంలో 25 మంది పోలీసులకు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆధ్వర్యంలో మూడో విడత డ్రోన్ శిక్షణ శుక్రవారం ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరిగే ఈ శిక్షణలో సైబర్ క్రైమ్, సోషల్ మీడియా ఇన్‌స్పెక్టర్ బెండి వెంకటరావు పాల్గొని శిక్షణ పొందుతున్న పోలీసులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణ, విపత్తుల సమయంలో సహాయక చర్యలతో పాటు ఇతర పోలీస్ విధులను సమర్థవంతంగా నిర్వహించడానికి అత్యాధునిక డ్రోన్ కెమెరాల వినియోగంపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. డ్రోన్ టెక్నాలజీ నేర నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. దీని ద్వారా జూద కార్యక్రమాలు, బహిరంగ మద్యపానం వంటి వాటిపై నిఘా పెట్టవచ్చని, అలాగే శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయవచ్చని పేర్కొన్నారు. అసాంఘిక శక్తులను నియంత్రించడానికి డ్రోన్లను విస్తృతంగా వినియోగించనున్నట్లు తెలిపారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని ముఖ్య కూడళ్లు, రద్దీ ప్రాంతాల్లో జరిగే మోసపూరిత, అనుమానాస్పద కార్యకలాపాలను ముందుగానే గుర్తించడానికి డ్రోన్ల ద్వారా నిఘా పెడుతున్నట్లు వెల్లడించారు. ముఖ్యంగా చైన్‌స్నాచింగ్, ఈవ్ టీజింగ్ వంటి వాటిని నియంత్రించడానికి, రోడ్డు ప్రమాదాలను గుర్తించడానికి కూడా డ్రోన్‌లను వినియోగిస్తున్నామని ఆయన వివరించారు.

విశాఖలో అత్యుత్తమ స్కేటింగ్ రింక్



వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్‌తో చర్చిస్తున్న శాప్ చైర్మన్ రవినాయుడు

మద్దిలపాలెం: విశాఖలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన స్కేటింగ్ రింక్‌ను ఏర్పాటు చేసేందుకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్), వీఎంఆర్‌డీఏ సంయుక్తంగా కృషి చేస్తున్నాయి. 2027లో విశాఖలో ఏషియన్ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించాలని రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్ణయించిన నేపథ్యంలో ఈ చర్యలు చేపడుతున్నారు. శాప్ చైర్మన్ రవినాయుడు, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్, స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జనరల్ సెక్రటరీ భగీరథతో కలిసి శుక్రవారం సంబంధిత శాఖాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా శాప్ చైర్మన్ రవినాయుడు మాట్లాడుతూ, దేశానికే తలమానికంగా నిలిచేలా అత్యాధునిక మౌలిక సదుపాయాలతో స్కేటింగ్ రింక్‌ను నిర్మించాలని, భవిష్యత్ తరాలు కూడా సద్వినియోగం చేసుకునేలా ఉండాలని సూచించారు. అలాగే రుషికొండలో వాటర్ స్పోర్ట్స్ అభివృద్ధిపైనా శాప్, వీఎంఆర్‌డీఏ సంయుక్తంగా చర్చించాయి. వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ మాట్లాడుతూ, విశాఖలో క్రీడల అభివృద్ధికి వీఎంఆర్‌డీఏ పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. అనంతరం శాప్ చైర్మన్ రవినాయుడు, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ వీఎంఆర్‌డీఏ పార్కులోని స్కేటింగ్ రింక్‌ను పరిశీలించి, స్కేటర్లను ప్రోత్సహించారు. కైలాసగిరిపై నిర్వహిస్తున్న జిప్ లైన్ (రోప్ ఫ్లైయింగ్), అడ్వెంచర్ గేమ్స్‌ను కూడా శాప్ పరిశీలించారు. ఈ కార్యక్రమాల్లో శాప్ డైరెక్టర్లు పీబీఎస్ఎన్ బుచ్చిరాజు, ఎం.డి. రమేష్ కుమార్, కొవ్వాసు జగదీశ్వరి, వీఎంఆర్‌డీఏ చీఫ్ ఇంజనీర్ వినయ్ కుమార్, ఎస్.ఈలు భవానీశంకర్, బలరామరాజు పాల్గొన్నారు.

పెదవాల్తేరు పోలమాంబకు ఘనంగా సారె సమర్పణ



కరకచెట్టు పోలమాంబ అమ్మవారికి సారె తీసుకువస్తున్న భక్తులు

బీచ్‌రోడ్డు: పెదవాల్తేరులో వేంచేసి ఉన్న శ్రీకరకచెట్టు పోలమాంబ అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం సారె సమర్పణ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం 10:30 గంటలకు మద్ది వారి పెద్దింటి నుంచి సారె కార్యక్రమం ప్రారంభమైంది. కోలాటాలు, సన్నాయి వాయిద్యాలతో కోలాహలంగా సాగిన ఈ ఊరేగింపులో చినవాల్తేరు, శివాజీపాలెం, ఆదర్శనగర్ ప్రాంతాల నుంచి మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఊరేగింపుగా పోలమాంబ అమ్మవారి గుడికి చేరుకున్న భక్తులు సారె సమర్పించి, అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థానం ఈవో గాయత్రి పటిష్ట ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం జిల్లా దేవాదాయ శాఖ సహాయ కమిషనరు టి. అన్నపూర్ణ, 20వ వార్డు కార్పొరేటర్ మువ్వల లక్ష్మీ సురేష్, పెదవాల్తేరు గ్రామ సేవా సంఘం నాయకులు పాల్గొన్నారు.

పార్టీ అభివృద్ధికి కృషి చేయాలి



మొల్లి అప్పారావుతో మధుసూదన రెడ్డి

బీచ్‌రోడ్డు: వైఎస్సార్‌సీపీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేయాలని తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు సూచించారు. తూర్పు నియోజకవర్గ సాంస్కృతిక విభాగం అధ్యక్షులుగా నియమితులైన పిలక మధుసూదన రెడ్డి శుక్రవారం అప్పారావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తనకు అవకాశం కల్పించినందుకు మధుసూదన రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మొల్లి అప్పారావు మాట్లాడుతూ, పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు ఎప్పుడూ గౌరవం ఉంటుందని స్పష్టం చేశారు. కష్టపడి పనిచేసి, అందుకున్న పదవికి వన్నె తేవాలని మధుసూదన రెడ్డికి సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి గుడ్ల గణేష్ రెడ్డి, ఇతర సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆశ వర్కర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు



ఆశ వర్కర్లను వినతులు స్వీకరిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మద్దిలపాలెం: ఆశ వర్కర్ల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపడతామని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ జగదీశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆశా వర్కర్లతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించి, వారి నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ, తమ స్థాయిలో గల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రస్థాయిలో ఉన్న సమస్యలను సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. ఆశ వర్కర్లు పనిచేసే చోట ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాలనే ఉద్దేశ్యంతో, ప్రతి మూడు నెలలకోసారి 'ఆశ గ్రీవెన్స్ మీటింగ్' నిర్వహించి సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని ఆయన స్పష్టం చేశారు. సమావేశంలో డీపీహెచ్ఎన్‌వో ఎం. సత్యవతి, డీసీఎం మణికుమారి పాల్గొన్నారు.